www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 6 జూలై 2023

నిట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నరేంద్రకుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-ఖాజీపేట
మండలం పరిధిలోని బి.తిప్పాయపల్లెకు చెందిన గంగిరెడ్డి నరేంద్ర కుమార్‌రెడ్డి కలికిరి నిట్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా (రెగ్యులర్) ఎంపికయ్యారు. ఈయన తల్లిదండ్రులు గంగిరెడ్డి చెన్నారెడ్డి, నాగేశ్వరమ్మ దంపతులు. నరేంద్ర కుమార్‌రెడ్డి అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగం సాధించడం పట్ల గ్రామస్తులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. కష్టపడి చదివి ఉన్నత స్థానానికి చేరుకోవడం సంతోషంగా ఉందని కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తపరిచారు.

బిల్లుల మోత.. ప్రజలకు వాత



పేద, ధనిక అని తేడా లేకుండా విద్యుత్ ఛార్జీలు పెరిగిపోయాయి. వినియోగదారుడు విద్యుత్ బిల్లులు చూస్తే షాక్‌కు గురయ్యే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం రకరకాల ఛార్జీల పేరుతో అదనంగా వసూలు చేస్తోంది. దీంతో సామాన్య ప్రజలు అల్లాడి పోతున్నారు. ప్రభుత్వాలు వసూలు చేస్తున్న అదనపు భారాలను వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అదనపు వసూళ్లపై వినియోగదారుల అభిప్రాయమాలిక.
- ప్రజాశక్తి-యంత్రాంగం

అధిక బిల్లులతో ఇబ్బందులు

విద్యుత్ బిల్లులు అధికంగా వస్తుండడంతో కుటుంబంపై ఆర్థిక భారం పడుతోంది. గతంలో కరెంటు బిల్లు ఇంటికి రూ.300 వచ్చేది. అంతే యూనిట్లు కాల్చినా ప్రస్తుతం రూ. 600 వస్తోంది. నా పిల్లల అంగడికి గతంలో రూ.600 వచ్చే. ఇప్పుడు రూ.900 వస్తోంది. బిల్లులో అడిషనల్ పేరుతో రకరకాల ఛార్జీలు వేస్తున్నారు.
-శ్రీనివాసులు, వేంపల్లె.

రూ.150 అదనపు బిల్లు

ప్రతి నెల రూ. మూడు వందల నుంచి రూ.350 వచ్చే బిల్లుకు ఈ నెల అదనంగా రూ.150 సర్దుబాటు ఛార్జీలు కలిపారు. దీంతో రూ. 520 కరెంట్ బిల్లు వచ్చింది ప్రభుత్వం అనేక రకాల ఛార్జీలను కలుపుతూ అధిక భారం మోపుతోంది. బిల్లులో దాదాపు సగం సర్దుబాటు ఛార్జీలు వేశారు. పేద ప్రజలకు చాలా ఇబ్బందిగా ఉంది.
- హరి, మైదుకూరు.

ఛార్జీలు తగ్గించాలి

ప్రభుత్వం ట్రూ ఆప్, సర్ ఛార్జీలతో పెంచి సామాన్య వ్యాపారులపై అధికభారం మోపింది. అధిక బిల్లులు చూసి చిన్న వ్యాపారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గతంలో రూ. 200 వచ్చే బిల్లు ప్రస్తుతం రూ. 900 వచ్చింది. ప్రభుత్వం వెంటనే విద్యుత్ ఛార్జీలు తగ్గించేలా చర్యలు తీసుకోవాలి.
-గుర్రంపాటి విశ్వనాథరెడ్డి, కూల్ డ్రింక్ షాపు యజమాని, వల్లూరు.

బిల్లు ముట్టుకుంటే షాక్

నిత్యావసర, కూరగాయల రేట్లు ఆకాశాన్నంటుతున్న నేపథ్యంలో విద్యుత్ ఛార్జీలు సామాన్యులపై పెనుభారం మోపింది. నెలనెలా వచ్చే విద్యుత్ బిల్లును ముట్టుకుంటే షాక్ కొడుతోంది. మధ్యతరగతి, పేదలకు బిల్లులు కట్టలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.
- యం.లక్ష్మీనారాయణమ్మ, గృహిణి, బద్వేలు.

ఛార్జీలు పెంచడం అన్యాయం

రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచడం అన్యాయం. పేద, మధ్య తరగతి వారు బిల్లులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారు. వాడిన యూనిట్లు కంటే అదనపు ఛార్జీలే ఎక్కువగా ఉంది. అద్దె ఇళ్లల్లోని వారి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం వెంటనే అదనపు ఛార్జీలను వసూలు చేయడం ఆపాలి.
-ప్రసాద్‌రెడ్డి, పులివెందుల.

పెనుభారంగా మారాయి

నెల నెలా పెరుగుతున్న ఛార్జీలు భారంగా మారాయి. అదనపు ఛార్జీల పేరుతో కరెంట్ బిల్లు ప్రతినెలా పెరుగుతుంది. పేదలు ఈ ప్రభుత్వంలో బతకడమే కష్టమవుతోంది. ఇటు నిత్యావసర ధరలు, కూరగాయల ధరలతో ఇబ్బందులు పడుతున్నాం. పైగా విద్యుత్ ఛార్జీలు భారంతో ఖర్చులు తడిసి మోపెడవుతోంది.
-శాంతయ్య- జమ్మలమడుగు.

సంపాదనలో సగం బిల్లుకే

సర్దుబాటు పేరుతో ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచింది. ప్రతి నెల వినియోగదారుడిపై అదనంగా భారం పడింది. ఇప్పటి వరకు ప్రతి నెల రూ.600 విద్యుత్ బిల్లు చెల్లిస్తున్నా. ఏకంగా రూ. 900 బిల్లు వచ్చింది. ఒకేసారి రూ.300 పెరిగితే సంపాదించిన డబ్బంతా విద్యుత్ ఛార్జీలకే సరిపోతుంది.
-బి.ఓబులేసు, ప్రొద్దుటూరు.

8 సార్లు ఛార్జీలు పెంచింది

వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత 8 సార్లు ఛార్జీలు పెంచింది. గతంలో రూ. 1000 లోపల విద్యుత్ బిల్లులు వచ్చేవి. గత నెలలో రూ.2300 బిల్లు ఇచ్చి, అదనంగా రూ. 2 వేలు వేసి కట్టమని చెబుతున్నారు. అధికారులను అడిగితే మాకు తెలియదంటున్నారు. వెంటనే అదనపు వసూళ్లను ఆపాలి.
-ఎన్.లక్ష్మీదేవి, గృహిణి, రాయచోటి.

ప్రజలపై అదనపు భారం

ప్రజలపై విద్యుత్ భారం తీవ్రంగా ఉంది. అద్దె ఇంటిలో నివసించే వారికి విద్యుత్ ఛార్జీలు పెను భారంగా మారాయి. ఇంటి బాడుగలు కట్టలేక అతలాకుతలం అవుతున్నాం. సర్దుబాటు, ట్రూఅప్, సర్, కస్టమర్ ఛార్జీలు, అదనపు లోడ్ డిపాజిట్లు.. ఇలా వివిధ రూపాల్లో ప్రభుత్వం ప్రజల నడ్డి విరుస్తోంది.
-డి.ప్రభాకర్‌రెడ్డి, టాక్సీ స్టాండ్ ప్రెసిడెంట్, మదనపల్లె.

మోటర్లకు మీటర్లు సరికాదు

ప్రభుత్వం ఒకవైపు విద్యుత్ ఛార్జీలు పెంచుతూ మరో వైపు మోటర్లకు మీటర్లు బిగిస్తానడం సరికాదు. మా వ్యవసాయ భూములకు మీటర్లు అమర్చేందుకు పట్టా పాస్ బుక్, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్, జిరాక్స్ తీసుకున్నారు. నగదును మీ అకౌంట్‌లో బదిలీ చేస్తామని అధికారులు చెబు తున్నారు. నగదు బదిలీపై నమ్మకం లేదు.
- శ్రీరాములు, బి.కొత్తకోట

ఛార్జీలు పెంచడం దారుణం

విద్యుత్ ఛార్జీలు విపరీతంగా పెరగడం చాలా దారుణం. కూలీ నాలీ చేసుకుని కష్టపడి సంపాదించిన డబ్బులు విద్యుత్, గ్యాస్ బిల్లులకే పోతే జీవనం ఎలా సాగించాలో అర్థం కావడం లేదు. గత నెలలో కంటే మరుసటి నెలలో రెండింతలు బిల్లు వచ్చింది. కరెంట్ షాక్ కొట్టినట్టు అయింది. ఎక్కువ యూనిట్లు కాల్చకపోయినా మీటర్ రీడింగ్ ఎక్కువగా చూపించి వసూలు చేస్తున్నారు.
- జానీ కుమార్, రాజారెడ్డివీధి, కడప.

బిల్లులు కట్టలేక చస్తున్నాం

విద్యుత్ బిల్లులు రోజురోజుకూ పెరుగుతుండడంతో కట్టలేక చస్తున్నాం. ఈ ఏడాదిలోనే రెండుసార్లు బిల్లులు పెంచేశారు. నెలనెలా పెరుగుతున్న కరెంటు బిల్లు చూసి, ఇంట్లో ఆడవాళ్లను అరవడం, వారు బాధపడడం పరిపాటిగా మారింది. వచ్చిన కరెంటు బిల్లు చూసి తామే సర్దుకుపోక తప్పడం లేదు. చాలీచాలని ఆదాయాలతో బతుకుతున్న సగటు కుటుంబాలకు పెరుగుతున్న బిల్లులు భారంగా మారు తున్నాయి.
-షేక్ అహ్మద్ బాషా, ఆటో కార్మికుడు, పీలేరు.

36 గంటల ధర్నాను జయప్రదం చేయండి

- పోస్టర్ ఆవిష్కరణలో సిఐటియు, అంగన్వాడీ నాయకుల పిలుపు

36 గంటల ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్
ఐసిడిఎస్‌ను పరిరక్షించాలని, అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం, పెన్షన్, పిఎఫ్, ఇఎస్ఐ, గ్రాడ్యూటీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10,11న నిర్వహించే 36 గంటల ధర్నా జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.లక్ష్మీదేవి, బి.లక్ష్మీదేవి పిలుపునిచ్చారు. బుధవారం సిఐటియు జిల్లా కార్యాలయంలో ధర్నా పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని కలెక్టరేట్ల ఎదుట నిరసన ధర్నాలు ఉంటాయని చెప్పారు. ఈ నెల 10న అంగన్‌వాడీల కోర్కెల దినోత్సవమని తెలిపారు. అఖిల భారత కమిటీ పిలుపు మేరకు నిరసన తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. బిజెపి 9 సంవత్సరాల పాలనలో అంగన్‌వాడిల సమస్యలు పరిష్కరించలేదని చెప్పారు. ఐసిడిఎస్ లక్ష్యానికి విరుద్ధంగా సెంటర్ల కుదించడం, నూతన విద్యావిధానాన్ని తీసుకువచ్చి ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగడం లేదని తెలిపారు. మరిన్ని డిమాండ్స్‌తో నిరసన ధర్నా నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి అంజలీదేవి, సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, నాయకులు రాజేశ్వరి, పవన్ పాల్గొన్నారు.

మానవత్వం లేని మనిషి జగన్ : 'యనమల'

అన్న క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న యనమల

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు
ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మానవత్వంలేని మనిషని శాసనమండలి ప్రతిపక్షనేత యనమల రామకృష్ణుడు అన్నారు. టిడిపి నాయకులు సురేష్ నాయుడు ఆర్థిక సహకారంతో ఏర్పాటైన అన్న క్యాంటీన్‌ను బుధవారం యనమల ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజీవ్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ తన స్వార్థపు ఆలోచనలతో ఇప్పటికే ఖజానా ఖాళీ చేశాడన్నారు. ఇందుకు ప్రజలకు సమాధానం చెప్పాల్సి ఉందన్నారు. టిడిపి హయాంలో పేదలకు అన్నంపెట్టేందుకు ప్రారంభించిన అన్న క్యాంటీన్లను ప్రభుత్వం వచ్చాక నిర్దాక్షిణ్యంగా మూసివేసి పేదలను ఆకలితో అలమటించేవిధంగా చేసిందన్నారు. జగన్ చరిత్ర చూస్తే అతను క్రిమినల్ అన్నది అర్థమైపోతుందన్నారు. జగన్ ఎంపీ కాక ముందుకు రూ.లక్ష కోట్లు దోచేశాడన్నారు. వచ్చే ఎన్నికల అనంతరం టిడిపి ప్రభుత్వం వస్తుందని జగన్‌కు తప్పకుండ శిక్ష పడుతుందన్నారు. దొంగ ఓట్లపైన ఆశపెట్టుకున్న జగన్‌కు సరైన గుణపాఠం కడప జిల్లా నుండే మొదఃలవుతుందని పేర్కొన్నారు. మాజీ మంత్రి జెసి దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ పేదల సంక్షేమం గురించి తొలుత ఆలోచనచేసింది టిడిపినే అన్నారు. మాజీ ఎమ్మెల్సీ బిటెక్ రవి, టిడిపి నాయకులు వరద రాజులరెడ్డి, అమీర్‌బాబు, సురేష్ నాయుడు, లింగారెడ్డి మాట్లాడుతూ మళ్లీ టిడిపికి పూర్వ వైభవం తప్పదన్నారు. సురేష్‌నాయుడుకు పోటీగా ఎమ్మెల్యే రాచమల్లు క్యాంటీన్‌ను త్వరలో ప్రారం భిస్తున్నారని తెలిసిందని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

ఆర్ఎంపిలపై చర్యలేవి? : డివైఎఫ్ఐ

బద్వేలు: కొందరు ఆర్ఎంపిలు ప్రభుత్వ అనుమతులు లేకుండా ప్రజల వద్ద వైద్యం పేరుతో అధిక దోపిడీ పాల్పడుతున్నారని అనేక దఫాలుగా డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా వైద్యశాఖ అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ వారి పైన ఇటువంటి చర్యలు తీసుకోకపోవడం వెనక ఉన్నటువంటి ఆంతర్యమేమిటని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని ప్రశ్నించారు. బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ బద్వేల్ పట్టణం గోపవరం, అట్లూరు, బి.కోడూరు, పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన మండలాలలో ఆర్ఎంపిలు పేద ప్రజల దగ్గర నుండి వైద్యం పేరుతో అధిక దోపిడి చేస్తున్నారని వారి పైన కఠిన చర్యలు తీసుకోవడంలో జిల్లా వైద్య శాఖ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మధ్యకాలంలో కొన్ని రోజుల క్రితం డిప్యూటీ డిఎంహెచ్ఒ పర్యటన ప్రాథమిక చికిత్స కేంద్రాలపై తూతూ మంత్రంగా సాగిందని విమర్శించారు. నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారన్నారు. ఆర్ఎంపిలు యథాప్రకారం వైద్యం చేస్తున్నారని తెలిపారు. కలెక్టర్ స్పందించి ఆర్ఎంపిలపై చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో డివైఎఫ్ఐ నాయకులు సురేంద్ర, నరసింహ, దస్తగిరి, సునీల్, మస్తాన్ పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ప్రతి ఒక్కరికీ భరోసా

పోరుమామిళ్ల టౌన్: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి జగనన్న సురక్ష కార్యక్రమం దోహదపడుతుందని మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని రంగసముద్రం గ్రామ పంచాయతీ సచివా లయం-2లో జగనన్న సురక్ష కార్యక్రమంలో నిర్వ హించారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి ముత్యాల ప్రసాద్, రంగ సముద్రం సర్పంచ్ చిత్త రవిప్రకాశ్‌రెడ్డి, ఎంపిటిసిలు కలవకూరి రమణ, జెల్లి వెంకట సుబ్బయ్య, ఎంపిడిఒ చంద్రమౌళి, వైసిపి యువ నాయకులు చిత్తా గిరిప్రణీత్‌రెడ్డి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు మానుకోవాలి

కడప: నాలుగు రోజులుగా సోషల్ మీడియాలో కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, నగర మేయర్ సురేష్‌బాబు, ఆర్‌టిసి చైర్మన్ మల్లికార్జున్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషాలపై కొందరు అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఇది మంచి పద్ధతి కాదని ఎపి సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్, నగర డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి అన్నారు. బుధవారం వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నిజంగా రాజకీయాలు చేయాలనుకుంటే హుందాతనంగా చేయాలన్నారు. ఎస్పీని కలిసి ఈ విషయంపై ఫిర్యాదు చేశామని చెప్పారు. సమావేశంలో వైసిపి ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు వినోద్ కుమార్, నాయకులు సుబ్బరాయుడు పాల్గొన్నారు.

అంధులకు ఉచిత శిక్షణ

కడప అర్బన్: ఎపి ప్రజా సౌహార్థ స్వచ్ఛంద సేవా సంస్థ, ఎపి వాలంటరీ ఆర్గనైజేషన్ ఫర్ పీపుల్స్ రిలీఫ్ కడప ఆధ్వర్యంలో అంధులు, దివ్యాగులకు ఉచిత కంప్యూటర్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకులు కమాల్‌బాష ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 20లోపు 89/208, సిఎంఆర్ పల్లె, అంగడి వీధి, కడపలో దరఖాస్తులు అందజేయాలని తెలిపారు.

జిల్లా అధ్యక్షులుగా నరేష్

కడప అర్బన్: తెలుగు వెలుగు సాహితీవేదిక స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా అధ్యక్షులుగా గొర్ల నరేష్‌ను నియమించారు. వేదిక వ్యవస్థాపక చైర్మన్ పోలోజు రాజ్‌కుమార్, జాతీయ అధ్యక్షులు డాక్టర్ మోహన్‌రావు నియామక పత్రాన్ని అందజేశారు.

అర్హులకు సంక్షేమ పథకాలు : డిప్యూటీ సిఎం

కడప అర్బన్: అర్హులందరికి సంక్షేమ పథకాలు అందజేయడమే ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సిఎం అంజాద్‌బాష అన్నారు. బుధవారం 5, 30, 43 డివిజన్లలోని సచివాలయాల్లో జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో అర్హత ఉన్న ఏ ఒక్కరి నోటా ప్రభుత్వ పథకాల ఫలాలు అందలేదనే మాట రాకూడదని అధికారులకు, స్థానిక ప్రజా ప్రతినిధులను ఆదేశించారు. వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, జగనన్న అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన.. ఇలా వివిధ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తోందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, ముంతాజ్‌బేగం, ఐసిడిఎస్ పీడీ శ్రీలక్ష్మి, ఎన్నికల విభాగం అధికారి శివారెడ్డి, కార్పొరేటర్లు పాల్గొన్నారు. మేయర్ సురేష్‌బాబుతో కలిసి డిప్యూటీ సిఎం 30వ డివిజన్‌లో అంగన్వాడీ కేంద్రాన్ని ప్రారంభించారు.

బదిలీ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

- యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు శ్రీనివాసరావు

కడప అర్బన్: బదిలీ ఉపాధ్యాయుల జీతాల సమస్యలు పరిష్కరించాలని యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులుఉ శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బుధవారం యుటిఎఫ్ భవన్‌లో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బదిలీలలో వివిధ పాఠశాలలకు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు క్యాడర్ స్ట్రెంత్ అప్‌డేట్ కాలేదన్న సాకుతో జీతాలు చెల్లించకపోవడాన్ని తీవ్రంగా నిరసిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 9న యుటిఎఫ్ భవన్‌లో నిర్వహించే ఫ్యాప్టో ఆధ్వర్యంలో నిర్వహించే సదస్సును జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శులు నవకోటేశ్వరరావు, లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ్‌కుమార్, పాలెం మహేష్‌బాబు, జిల్లా సహాధ్యక్షులు రవికుమార్, నాయకులు కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

పాఠశాలలపై చర్యలకు డిమాండ్

కడప అర్బన్: జిల్లా వ్యాప్తంగా ఉన్న కార్పోరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలో ఫీజు దోపిడీని అరికట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్ డిమాండ్ చేశారు. బుధవారం డిఇఒ రాఘవ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న కార్పోరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేల రూపాయలు ఫీజులు వసూలు చేస్తూ అక్రమ సంపాదనే ధ్యేయంగా పాఠశాలలోనే పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, షూ, స్టేషనరీ విక్రయిస్తున్నారని తెలిపారు. విద్యాసంస్థలను వ్యాపార కేంద్రాలుగా మారుస్తున్నారని విమర్శించారు. ఇంత జరుగుతున్న జిల్లా విద్యాశాఖ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గండి సునీల్ కుమార్, నగర అధ్యక్షులు బుక్కె సురేష్ నాయక్ పాల్గొన్నారు.

నేడు ప్రతిఘటన ధర్నా

కడప అర్బన్: సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలని, గ్యారెంటీ పెన్షన్ పథకం వల్ల ఇబ్బందులకు ప్రభుత్వానికి తెలియజేయడానికి ఈ నెల 8న ప్రతిఘటన ధర్నా నిర్వహిస్తున్నట్లు ఎపి కంట్రిబ్యూటరి పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ వెంకట జనార్ధనరెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండారెడ్డి, ఖాదర్‌బాష ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

చింతకొమ్మదిన్నె: ప్రజలకు మెరుగైన సేవలు అందించుటకు ఎల్లప్పుడూ ముందుండాలని డాక్టర్ పర్వీన్ సుల్తానా పేర్కొన్నారు, బుధవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను సెంట్రల్ టీం సభ్యులు, పర్వీన్ సుల్తానా తనిఖీ చేశారు. ల్యాబ్, డెలివరీ రూం, పేషంట్స్ వార్డు సందర్శించారు. ఆస్పత్రికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రిలో జరుగు సేవలను గురించి కూలకశంగా ఆరా తీశారు. రికార్డులన్నీ బాగున్నాయని ఆస్పత్రిలో సేవలు, పరిసరాలు శుభ్రంగా ఉండడంతో డాక్టర్ రాఘవేంద్రను ప్రశంసించారు. కార్యక్రమంలో డిపిఎంఒ డాక్టర్ శశి భూషణ్‌రెడ్డి, డిప్యూటీ డిఎంహెచ్ఒ లక్ష్మీకర్, డిఎంఒ మనోరమ, డిపిఒ నారాయణ, క్వాలిటీ కంట్రోలింగ్ ఇన్‌ఛార్జి రమేష్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

13న బీడీ కార్మికుల సదస్సు

కడప అర్బన్: బీడీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 13న నెల్లూరులో నిర్వహించే రాష్ట్ర సమన్వయ సమావేశం జయప్రదం చేయాలని బీడీ వర్కర్స్ ఫెడరేషన్ నగర గౌరవాధ్యక్షులు చంద్రారెడ్డి పిలుపు నిచ్చారు. బుధవారం సమావేశాల కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీడీ కార్మికులకు వెయ్యి బీడీ కట్టలు చుడితే రూ.500 ఇవ్వాలని, పిఎఫ్, ఇఎస్ఐ, బోనస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కూర్చొని బీడీలు చుట్టడం వల్ల మోకాళ్లు, నడుము, వెన్నెముక, ఆస్మా, క్షయ, గర్భసంచి వ్యాధుల భారినపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీడీ కార్మికులు జరీనా, గౌసియా, హసీనా, భాను పాల్గొన్నారు.

రేపటి నుంచి ఎపి గైనిక్ రాష్ట్ర సదస్సు

కడప అర్బన్: ఎపి గైనకాలజి సొసైటీ 8వ రాష్ట్ర స్థాయి వార్షికోత్సవ సదస్సు ఈ నెల 7 నుంచి 9 వరకు నిర్వహిస్తున్నట్లు గైనిక్ సొసైటీ కడప అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ పద్మలత, డాక్టర్ ప్రమోదారెడ్డి తెలిపారు. బుధవారం ఐఎంఎ హాలులో సదస్సు బ్రోచర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాధవి కన్వెన్షన్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ అబ్స్ట్రిక్స్ అండ్ గైనకాలజి సొసైటి (ఎపిఒజిఎస్) 8వ వార్షికోత్సవ సదస్సును నిర్వహించనున్నారు. రాష్ట్ర స్థాయి సదస్సుకు అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర స్థాయిలో పేరు పొందిన ప్రముఖ గైనకాలజిస్టులు, వక్తలు హాజరు కానున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రిమ్స్ హెచ్ఒడి డాక్టర్ లక్ష్మి సుశీల, ఫిమ్స్ హెచ్ఒడి డాక్టర్ రమాదేవి, కడప అబ్స్ట్రిక్స్ అండ్ గైనకాలజీ సొసైటీ ఉపాధ్యక్షులు డాక్టర్ బి.ఉషారాణి, సంయుక్త కార్యదర్శి డాక్టర్ పి.సమిత, కోశాధికారి డాక్టర్ కె.శశికళ, కార్యవర్గ సభ్యులు డాక్టర్ మృదుల, డాక్టర్ కళావతి, డాక్టర్ పి.జ్యోతి, డాక్టర్ శ్రీలత, డాక్టర్ మల్లిక పాల్గొన్నారు.

బిసి భవనానికి స్థలం కేటాయించాలి

బద్వేలు : జనాభాలో 50 శాతం ఉన్న బిసిలను సమావేశాల ద్వారా చైతన్యం, ఐకమత్యం చేయడానికి కమ్యూనిటీ భవనం అవసరమని, పట్టణంలో 50 సెంట్ల ప్రభుత్వ స్థలం కేటాయించాలని బిసి చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షులు బి.సి.రమణ అన్నారు. బుధవారం పట్టణంలోని ఆవాజ్ కార్యాలయంలో పూలే ఆశయ సాధన సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థలం కేటాయించాలని నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, అధికారులను అనేక సార్లు కలిసి విన్నవించుకున్నా ప్రయోజనం లేదన్నారు. పూలే ఆశయ సాధన సమితి చైర్మన్ గురుమూర్తి మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 76 సంవత్సరాలు పూర్తయినా నేటికీ బిసిలకు సమావేశాలు ఏర్పాటు చేసుకునేందుకు భవనాలు లేకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో మరాఠా సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు బి.ఎన్.ఆర్. సాగర్, రెడ్డి సంఘం నాయకులు వినాయకరెడ్డి, జాతీయ బిసి సంక్షేమ సంఘ జిల్లా వర్కింగ్ అధ్యక్షులు యు.రమణయాదవ్, పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి రాష్ట్ర నాయకులు ఎం.పిచ్చయ్య, ఆవాజ్ కమిటీ బద్వేలు కార్యదర్శి షేక్ అన్వర్‌బాష, కార్యవర్గ సభ్యులు మస్తానయ్య, రూసూల్, రజక సంఘం నాయకులు వెంకటరమణ పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు : జడ్జి

కడప: పిల్లల విద్య, ఆరోగ్య విషయాల పట్ల పలు జాగ్రత్తలు వహించాలని అధికారులను ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్.కవిత ఆదేశించారు. బుధవారం కడప నగరం కో-ఆపరేటివ్ కాలనీలోని ప్రభుత్వ కళాశాల బాలికల వసతి గృహాన్ని జడ్జి సందర్శించారు. అక్కడ న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. పిల్లలకు అందుతున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలు సత్ప్రవర్తనతో విద్యను అభ్యసించాలి అని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వంటగదులను, వసతి గదులను పరిశీలించారు. పిల్లల విద్య, ఆరోగ్య విషయాల పట్ల తగు జాగ్రత్తలు వహించాలని అధికారులను ఆదేశించారు. సెల్ ఫోన్స్ వలన కలిగే నష్టాలను తెలియజేశారు. విద్యార్థులకు సూచనలు ఇవ్వడం జరిగినది. పిల్లలు ఏఏ తరగతులను అభ్యసిస్తున్నారు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ ఆఫీసర్ జ్యోతి, విద్యార్థినిలు పాల్గొన్నారు.

క్రీడా కోటాను కొనసాగించాలి

కడప అర్బన్: ప్రభుత్వం ఉద్యోగాల్లో క్రీడా కోటాను కొనసాగించాలని డివైఎఫ్ఐ నగర కార్యదర్శి డి.ఎం.ఓబులేసు డిమాండ్ చేశారు. బుధవారం డివైఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఉద్యోగాల్లో క్రీడా కోటా రద్దు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. సమావేశంలో నగర ఉపాధ్యక్షులు విజయ్, ఉపయ్ పాల్గొన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

కడప: సమాచార హక్కు చట్టం ప్రకారం అడిగిన సమాచారాన్ని గడువులోపు ఇవ్వని రెవెన్యూ అధికారులపై జిల్లా ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు పాలగిరి శివ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల నుంచి సమాచారాన్ని అడిగి తీసుకునే అధికారమే సమాచార హక్కు చట్టమన్నారు. చింతకొమ్మదిన్నె మండలం రెవెన్యూ అధికారులు సామాన్య ప్రజలకు కల్పించిన సమాచార హక్కు చట్టం ద్వారా ఈ ఏడాది ఏప్రిల్ 3వ తేదీన మానవ హక్కుల సంఘం కమిటీ తరపున సమాచారం కోసం దరఖాస్తు చేసుకున్నామని తెలిపారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి డప్పు చంద్ర, జనరల్ సెక్రెటరీ రాజేష్ కుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యం

కడప: రాహుల్ గాంధీ ప్రధాని అయితేనే దేశం అభివృద్ధి చెందుతుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్ అన్నారు. బుధవారం డిసిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ త్వరలో రాబోయే నాలుగు రాష్ట్రాల ఎన్నికలలో తప్పకుండా కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి గెలిపించుకొని ప్రశాంత వాతావరణాన్ని కోరుకుందామన్నారు. కొంతకాలంగా అల్లర్లతో రగులుతున్న మణిపూర్‌లో కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ అక్కడ పరిస్థితులను కనుగొనడానికి బయలుదేరుతుండగా పోలీసు వారు అడ్డగించడం ఏమాత్రం సమంజసం కాదని తెలిపారు. రాబోయే 2024 ఎన్నికలలో తప్పకుండా కాంగ్రెస్ పార్టీని గెలిపించుకుందామన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శులు పెనుమల ఓబులేసు, కె.గంగాధర్, మైనార్టీ నాయకులు అబ్దుల్ రసూల్ పాల్గొన్నారు.

వైసిపి కువైట్ కన్వీనర్లుగా ఇలియాస్, బాలిరెడ్డి

కడప: వైసిపి గల్ఫ్ కువైట్ కన్వీనర్లుగా బి.హెచ్. ఇలియాస్, ముమ్మడి బాలిరెడ్డిలను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమపై నమ్మకంతో మరోసారి గల్ఫ్ కువైట్ కన్వీనర్లుగా నియమించినందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, సహకరించిన రాజ్యసభ సభ్యులు వి.విజయసాయిరెడ్డి, ప్రధాన సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డి, గ్లోబల్ కన్వీనర్ మేడపాటి వెంకట్, ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్‌బాషా, కడప, రాజంపేట ఎంపీలు అవినాష్‌రెడ్డి, మిథున్‌రెడ్డి, మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్యేలకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. కువైట్ కమిటి సభ్యులు అందరికి ధన్యవాదాలు తెలియజేశారు. గల్ఫ్‌లో ఉన్న 6 దేశాల కన్వీనర్లుగా నియమించిన యుఎఇ కన్వీనర్ సయ్యద్ అక్రమ్, ఖతార్ కన్వీనర్ దొండపాటి శశికిరణ్, సౌదీ కన్వీనర్ రివల్ అంథోని, బెహ్రాయిన్ కన్వీనర్ బలరాం రాజు, ఒమాన్ కన్వీనర్ ఎస్.బాలకృష్ణ, గల్ఫ్ కో-కన్వీనర్ గోవిందు నాగరాజు, యుఎఇ సలహా కమిటీ సభ్యులు సోమిరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డిలకు శుభాకాంక్షలు తెలిపారు.

తప్పుడు కేసులు దారుణం : ఎస్ఎఫ్ఐ

కడప అర్బన్: విద్యార్థికి న్యాయం చేయాలని ఆడిగితే విద్యార్థి సంఘాల నేతలపై తప్పుడు కేసులు నమోదు చేయడం దారుణమని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్ అన్నారు. బుధవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంల ఆయన మాట్లాడుతూ ఖాజీపేట మండల పరిధిలోని బీరం శ్రీధర్‌రెడ్డి స్కూల్ విద్యార్థి సోహిత్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందారని పేర్కొన్నారు. విద్యార్థికి న్యాయం చేయాలని విద్యార్థి తల్లిదండ్రులకు మద్దతుగా పాఠశాల వద్ద బైఠాయించి ఆందోళన చేసిన విద్యార్థి సంఘాల నాయకులపై కేసు నమోదు చేయడం సిగ్గుచేటని చెప్పారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సునీల్‌కుమార్, నగర అధ్యక్షులు సురేష్ నాయక్ పాల్గొన్నారు.

రేపు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌డ్రైవ్

కడప: జవహర్ నాలెడ్జ్ సెంటర్ (జెకెసి) ద్వారా ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, జివెంచర్స్ ప్రయివేట్ లిమిటెడ్ వారు రిలేషన్షిప్ మేనేజర్ అండ్ టూర్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు ఈ నెల ఏడవ తేదీన కడప ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ఉదయం 9:30 గంటలకు జాబ్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ జి. రవీంద్రనాథ్, జవహర్ నాలెడ్జ్ సెంటర్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.రేఖ తెలిపారు. 18-26 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన స్త్రీ, పురుష అభ్యర్థులకు జాబ్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏదైనా డిగ్రీ అర్హత కలిగి, 2020, 2021, 2022లో పాసైన అభ్యర్థులు, ప్రస్తుతంఫైనల్ ఇయర్ చదువుతున్న వారు పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు.

మార్కెట్ యార్డులో రూ.50కే టమోటా

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల మున్సిపాలిటీలో ప్రజలకు రూ.50కే టమోటాలు అందిస్తున్నట్లు ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మార్కెట్ యార్డులో బుధవారం టమోటా విక్రయ కేంద్రాన్ని ప్రారంభించారు. ఎంపీ అవినాష్‌రెడ్డి చొరవతో పులివెందుల ప్రాంత ప్రజలకు రూ.50కే టమోటాలు అందించాలని సంకల్పంతో రెండు టన్నుల టమోటాలను దిగుమతి చేసినట్లు ఆయన తెలిపారు. బయట మార్కెట్లలో రూ.150 ఉందన్నారు. ఒక ఆధార్‌కార్డుకు కిలో ప్రకారం టమోటాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైసిపి నాయకులు వైఎస్ అభిషేక్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షులు రాజు, నాయకులు చంద్రమౌళి, హాజీ గంగాధర్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ సర్వోత్తమ్‌రెడ్డి, మున్సిపల్ కో-ఆప్షన్ చంద్రమౌళి పాల్గొన్నారు.



టమోటాలను అందిస్తున్న ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి

మెరుగైన వైద్య సేవలందించాలి : డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి - వేంపల్లె

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య ఆరోగ్య శాఖ జిల్లా అధికారి డాక్టర్ నాగరాజు సిబ్బందిని కోరారు. బుధవారం తాళ్లపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని కత్తులూరు గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామీణ ప్రాంతాలలో అందుతున్న వైద్య సేవలు గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డిఎంహెచ్‌ఒ మాట్లాడుతూ ప్రజల ఇంటి వద్దకే వైద్యసేవలు అందించాలని ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుందన్నారు. ప్రభుత్వాసుపత్రిలోనే కాన్పులు అయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుధాకర్, తాళ్ళపల్లె ప్రాథమిక వైద్యురాలు స్వాతిసాయి, డాక్టర్ నిజామొద్దీన్, డాక్టర్ పృథ్వీ, ఎఎంఒ వెంకటరెడ్డి, ఎంపిహెచ్ఇఒ ప్రసాద్, ఎఎన్ఒ నాగశ్వర్ణమ్మ, సిహెచ్ఒ రమాదేవి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలపై చర్చించే అవకాశం ఇవ్వాలి : జెఎసి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఆర్‌టిపిపి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై చర్చించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవకాశం ఇవ్వాలని జెఎసి నాయకులు డిమాండ్ చేశారు. స్థానికంగా వారు బుధవారం విలేకరులతో మాట్లాడుతూ సిఎం సొంత జిల్లాలో విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు, వారి కుటుంబాలు చీకటి జీవితంలో బతుకుతున్నారన్నారు. జగన్ పాదయాత్రలో భాగంగా మొట్టమొదటి హామీగా ఎర్రగుంట్ల బహిరంగ సభలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆర్‌టిపిపిలో పనిచేస్తున్న విద్యుత్ కాంట్రాక్టు కార్మికులందరినీ రెగ్యులర్ చేస్తానని హామీ ఇచ్చారన్నారు. ఆ హామీ ఇంతవరకు నెరవేరలేదన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని విద్యుత్ కాంటాక్టు కార్మికులు కోరారు. జిల్లా పర్యటనకు విచ్చేస్తున్న సందర్భంగా తమ సమస్యలను చర్చించుటకు జెఎసి నాయకులకు అవకాశం ఇవ్వాలని కోరారు. సమావేశంలో జెఎసి నాయకులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యంతో ముందడుగు వేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ముందడుగు వేసి ఆయా రంగాల్లో ఉన్నత స్థాయిలో రాణించాలని ఎంఇఒ-2 స్టాలిన్ ఐజాక్ కోరారు. స్థానిక భవిత కేంద్రంలో పది, ఇంటర్ పూర్తి చేసిన విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భవిత కేంద్రంలో చక్కగా చదువుకొని ఉన్నత విద్యలో ఉత్తీర్ణత సాధించడం సంతోషంగా ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో ప్రతి విద్యార్థి ముందడుగు వేయాలన్నారు. అనంతరం రాజ్‌కుమార్, ముబారక్, గౌస్‌బాషా, ఆబియాతోపాటు అలీషా, సాదియా, నజ్మిన్, సుహనా, సుజాత, అన్వర్‌బాషా, సిద్దిక్, ఇమాంబీ ఉత్తీర్ణత సాధించారని సన్మానించి, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఇఒ వీరారెడ్డి, ఉర్దూ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్‌రావు, ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయుడు అక్బర్, ఐఇఆర్‌టి యశోద, సిఆర్‌పి ప్రకాష్‌రెడ్డి, మెయిన్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరసింహారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు..

10న ఐటిఐలో జాబ్‌మేళా

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక కందుల ఓబుల్‌రెడ్డి ఛారిటీస్ ఐటిఐలో ఈనెల 10న ఉదయం జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు ఐటిఐ ప్రిన్సిపల్ ప్రసాద్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చైన్నైలోని పెనాసోనిక్, ఇండియా జపాన్ లైటింగ్, సూపర్ ఆటోపోర్జ్ వంటి పెద్ద కంపెనీల్లో పని చేయడానికి అవకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఒరిజినల్ సర్టిఫికెట్లతో అభ్యర్థులు హాజరు కావాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు జీతం రూ.15 వేలు ఉంటుందన్నారు. ఉచిత భోజనం, రవాణా, వసతి సౌకర్యం కల్పించనున్నట్లు ఆయన వివరించారు. వివరాలకు తమను సంప్రదించాలని ప్రిన్సిపల్ కోరారు.

తృటిలో తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి - చక్రాయపేట

సురభి గ్రామ పంచాయితీలోని గాజులపేట అంగన్వాడీ కేంద్రం లో బుధవారం గ్యాస్ లీకై పెద్ద ఎత్తున మంటలు లేచాయి. ఈ ప్రమా దంలో రికార్డ్స్, స్టాక్ అంతా కాలి పోయాయి. ప్రమాద సమయంలో అంగన్వాడీ టీచర్ చాకచక్యంగా పిల్లలను బయటకు తేవడంతో పెద్ద ప్రమాదం తప్పి నట్లయింది. దీంతో అంగన్‌వాడీ కార్యకర్త, తల్లిదండ్రులు ఊపిరిపీల్చుకున్నారు.

గ్యాస్ లీకవడంతో వస్తున్న మంటలు

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండలంలోని ఆర్‌టిపిపి కర్మాగారంలో భాస్కర్‌రెడ్డి అనే వ్యక్తి బుధవారం అనుమానాస్పదంగా మృతి చెందాడు. మృతుడు ఆరు నెలల క్రితం నెల్లూరు నుండి ఇక్కడికి వచ్చినట్లు సమాచారం. మతుడు స్టేజ్ 1లో ఒఅండ్ఎంలో మెయింటనెన్స్ పనులు నిర్వర్తించేవాడని తోటి కార్మికులు తెలిపారు. సాయంత్రం విరామ సమయంలో టీ తాగి తన విధులకు వెళుతుండగా రాడ్డుతో తలపై బలంగా కొట్టడంతో మృతి చెందినట్లు సమాచారం. మృతదేహానికి సమీపంలో రాడ్ కూడా ఉండడంతో అనుమానాస్పద మృతిగా భావిస్తున్నారు. కొందరు కార్మికులు మాత్రం ప్రమాదవశాత్తూ పై నుండి పడడంతో మృతి చెందినట్లు తెలిపారు. భాస్కర్‌రెడ్డికి రెండు నెలల క్రితమే పెళ్లి అయినట్లు తెలిసింది. మృతదేహం వద్దకు కార్మికులు, బయటి వ్యక్తులను రాకుండా పోలీసులు అడ్డుకున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఇసుక అక్రమ నిల్వలు స్వాధీనం

ప్రజాశక్తి - కొండాపురం

మండలంలోని పెన్నా నది ఒడ్డున సంకేపల్లి గ్రామ సమీపంలో అక్రమంగా నిలువ ఉంచిన ఇసుకను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. అందిన సమాచారం మేరకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఎల్.చెన్నారెడ్డి తన సిబ్బందితో దాడి చేశారు. స్వాధీనం చేసుకున్న ఇసుక దాదాపు 220 టన్నులు ఉంటుందని సిఐ తెలిపారు. ఇసుక అక్రమంగా నిల్వ చేసిన గుడ్డం వెంకటనారాయణరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇసుకను తహశీల్దార్‌కు అప్పజెప్పామని సిఐ వివరించారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఎవరైనా ఇసుక అక్రమంగా తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

'ఉక్కు' నిర్మాణంపై నీలినీడలు ..!

ప్రజాశక్తి - జమ్మలమడుగు

ఉక్కు పరిశ్రమ నిర్మాణ మొదటి దశ పనులు 30 నెలల్లో పూర్తవుతాయని ఈ ఏడాది ఫిబ్రవరి 15న మండలంలోని సున్నపు రాళ్లపల్లెలో రెండవసారి భూమిపూజ చేసే సందర్భంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన మాటలు.. ఈ ఉక్కు పరిశ్రమ నిర్మాణం 3 మిలియన్ టన్నుల సామర్థ్యంతోనే ఆగిపోదని.. పరిశ్రమతో వైఎస్ఆర్ జిల్లా ముఖ చిత్రమే మారిపోతుందని.. రూ.8,800 కోట్లతో పరిశ్రమ నిర్మాణం జరుగుతుందని సిఎం సభలో ప్రకటించారు. 3,500 ఎకరాలు జిందాల్ కంపెనీకి ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి ఇవ్వడమే కాకుండా, రూ.700 కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. తద్వారా అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు అవుతాయని, జమ్మలమడుగు స్టీల్ సిటీగా మారుతుందన్నారు. ప్రొద్దుటూరు-ఎర్రగుంట్ల రైల్వేలైన్‌ను కలుపుతూ మరో 10 కిలోమీటర్లు కొత్త రైల్వేలైన్ నిర్మాణ పనులు చేపడుతామని బహిరంగ సభలో ముఖ్యమంత్రి తెలిపారు. అయితే ఉక్కు పరిశ్రమ నిర్మాణ ప్రాంతంలో 10 జెసిబి యంత్రాలతో ముళ్లపొదలను తొలగించారు. అనంతరం ఆ నిర్మాణ పనుల్లో ఎలాంటి పురోగతి లేదు. ఈ ఏడాది ఏప్రిల్ నుండి పూర్తిస్థాయిలో పనులు ప్రారంభమవుతాయని ముఖ్యమంత్రి చెప్పినా ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. వైసిపి ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్లలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మొదటిసారి ఉక్కు పరిశ్రమకు భూమిపూజ చేశారు. అయితే కరోనాను సాకుగా చూపి మూడు సంవత్సరాల కాలం వెల్లదీశారు. సార్వత్రిక ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో హడావుడిగా రెండవసారి ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు భూమిపూజ నిర్వహించారు. జెఎస్ డబ్ల్యు గ్రూప్‌తో ఉక్కు పరిశ్రమ నిర్మాణం ఒప్పందం పూర్తయిందని, ఇక ఉక్కు పరిశ్రమ పనులు వేగవంతం అవుతాయని భావించారు.

రెండవసారి పరిశ్రమ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్‌ఫొటో)

ఎన్నికల ఏడాది కావడంతో కోట్ల రూపాయలు ఉక్కు పరిశ్రమ నిర్మాణ పనులు చేపట్టడానికి జెఎస్‌డబ్ల్యు గ్రూప్ వెనుకంజ వేస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఉక్కు పరిశ్రమ నిర్మాణంపై నీలి నీడలు కమ్ముకున్నాయి. ఈ ఏడాది ప్రారంభంలో వామపక్ష పార్టీలు, ప్రతిపక్షపార్టీల మద్దతుతో ఉక్కు కర్మాగారం నిర్మాణానికి పాదయాత్ర చేపట్టాయి. దీంతో ప్రభుత్వం జెఎస్ డబ్ల్యు గ్రూప్ ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి చర్యలు తీసుకున్నారని ప్రకటించింది. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పటికీ రెండవసారి ఉక్కు పరిశ్రమకు శంకుస్థాపన నిర్వహించి మమా అనిపించారు. రెండవసారి భూమిపూజ నిర్వ హించి ఐదు నెలలు కావస్తున్నప్పటికీ ఉక్కు పరిశ్రమ నిర్మాణంలో ఎలాంటి కదలికల్లేవు. ఈ పరిస్థితుల్లో ప్రతిపక్ష పార్టీలు విమర్శలు గుప్పిస్తున్నాయి. జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఉద్యమం ఎక్కడ ఉవ్వెత్తున ఎగసిపడుతుందోనని అధికార పార్టీ భయంతోనే రెండవసారి ఉక్కు పరిశ్రమ నిర్మాణం తప్ప, ఉక్కు నిర్మాణం చేపట్టాలని చిత్తశుద్ధి ముఖ్యమంత్రికి లేదని విమర్శిస్తున్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి ఈ ప్రాంత ప్రజలను మోసం చేసేందుకు ఉక్కు నిర్మాణం పనులు అని విపక్షాలు ఆరోపిస్తున్నాయి.

అర్హులందరికీ పథకాలు అందించడమే లక్ష్యం

ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

ప్రభుత్వ పథకాలను అర్హులకు అందుచేందుకే జగనన్న సురక్ష కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని 5,6 వార్డు సచివాలయం పరిధిలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యలకు అధికారులు వెంటనే పరిష్కారం చూపించాలన్నారు. ప్రజలకు దగ్గరయ్యేందుకే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా వార్డులో నెలకొన్న స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పోరెడ్డి రామలక్ష్మమ్మ, పట్టణ అధ్యక్షులు పోరెడ్డి మహే శ్వర్‌రెడ్డి, కమిషనర్ వెంకట్రామిరెడ్డి, 5,6 వార్డు కౌన్సిలర్లు సావిత్రి, వెంకట లక్ష్మి, వైసిపి నాయకులు మల్కిరెడ్డి హనుమంత్‌రెడ్డి, వేణు యాదవ్, సచి వాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. **చాపాడు :** వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల చెంతకే ప్రభుత్వం వెళుతోందని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి అన్నారు. మండలంలోని ఖాదర్‌పల్లి గ్రామంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులు ఉండి పథకాలు అందకపోతే వారిని గుర్తించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అవసరమైన ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అంద జేస్తున్నామన్నారు. సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే మన రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఖాదరపల్లిలో 305 మందికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి లక్ష్మయ్య, మండల ప్రత్యేక అధికారి సురేష్‌రెడ్డి, తహశీల్దార్ సుభాని, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ రాధాకృష్ణవేణి, డిప్యూటీ తహశీల్దార్ భవాని, మండల అధికారులు, సర్పంచు షమీంబాను, నాయకులు శేఖర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, జైనుల్లా, నరసింహారెడ్డి, జయరామిరెడ్డి, జయసుబ్బారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, రమణయ్య, ప్రసాద్, మల్లికార్జునరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పులివెందుల టౌన్ : ప్రజల చెంతకే సంక్షేమ పథకాలు అందిస్తున్నామని పాడా ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం చెన్నారెడ్డి కాలనీ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు ఆదాయ, వివాహ, జనన తదితర 11 రకాల ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హాఫీజ్, కమిషనర్ నరసింహారెడ్డి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు. **ఎర్రగుంట్ల :** తిప్పలూరు గ్రామంలో ఎంపిడిఒ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి లబ్ధిదారులకు పత్రాలను అందించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు తమ సమస్యలపై ఎమ్మెల్యేను నిలదీశారు. రోడ్లు సరిగా లేవని, రోడ్లపైనే నీరు పారుతోందని, కాలువలు ఉన్నా వృథా అని వాపోయారు. తమ ఇళ్లలోకి నీరు వస్తోందని ఎస్‌సి కాలనీ వాసులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ ఆ ప్రాంతాన్ని పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తిప్పలూరు సర్పంచు అంబటి పార్వతమ్మ, ప్రభుత్వ మాజీ వ్యవసాయ సలహాదారుడు అంబటి కృష్ణారెడ్డి హాజరుకాకపోవడం గమనార్హం. జడ్‌పిటిసి బాలయ్య, మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి, అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. పట్టణంలోనిమహేశ్వర్ నగర్ మూడవ సచివాలయ పరిధిలో మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి పత్రాలు అందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **చక్రాయపేట :** నెర్సుపల్లె సచివాల యంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో 125 మందికి పత్రాలను పంపిణీ చేశామని ఎంపిడిఒ కె.శివారెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ వి.రాజసింహ నరేంద్ర, జడ్‌పిటిసి టి.శివప్రసాద్‌రెడ్డి, మండల ఇన్‌ఛార్జి ఓబుల్‌రెడ్డి, ఎంపిటిసి మోహన్‌రెడ్డి, కన్వీనర్ రామాంజనేయరెడ్డి, నెర్సుపల్లె సర్పంచు, గ్రామ పంచాయతీ కార్యదర్శి, వాలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు.

కలిసికట్టుగా పనిచేస్తే జగన్‌ను ఓడించొచ్చు

ప్రజాశక్తి - వేంపల్లె

పులివెందులలో టిడిపి కార్యకర్తలు కలిసికట్టుగా పని చేస్తే సిఎం జగన్‌ను కూడా ఓడించడమనేది కష్టం కాదని శాసన మండలి ప్రతిపక్ష నాయకుడు యనమల రామకృష్ణుడు అన్నారు. వైసిపికి చెందిన మాజీ వక్ఫ్ బోర్డు సభ్యుడు నిమ్మకాయల మహమ్మద్ దర్బార్, పాములూరు రామాంజనేయురెడ్డి (చంటి)తోపాటు ఆయన అనుచరులు 150 మంది బుధవారం టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా మహమ్మద్ దర్బార్‌కు యనమల రామకృష్ణుడు పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిఎం జగన్‌కు ఇప్పటికే భయం పట్టుకుందన్నారు. ఉన్న సీటు కూడా పోతుందని ఎద్దేవా చేశారు. పులివెందుల నియోజకవర్గంలోనే వైసిపి నుండి టిడిపిలోకి రావడం సంతోషంగా ఉందన్నారు. ముందుగా పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ నాలుగేళ్లల్లో సిఎం జగన్ నవరత్నాల పేరుతో బటన్ నొక్కి, మరోపక్క పేద ప్రజల నడ్డి విరుస్తున్నారని విమర్శించారు. ఎంపీగా అవినాష్‌రెడ్డి ఏమి చేశారని ప్రశ్నించారు. పులివెందుల ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రరెడ్డి మాట్లాడుతూ వేంపల్లె మండలంలోనే టిడిపి పార్టీలో చేరికలు ఉన్నాయంటే రాష్ట్ర వ్యాప్తంగా పరిస్థితి ఏవిధంగా ఉంటుందో ప్రజలందరూ గమనించాలన్నారు. నిమ్మకాయల మహమ్మద్ దర్బార్ మాట్లాడుతూ టిడిపి బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు లింగారెడ్డి, మైదుకూరు ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్, కడప ఇన్‌ఛార్జి అమీర్ బాబు, రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, రామమునిరెడ్డి, మహమ్మద్ షబ్బీర్, తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు బాలస్వామిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు జగన్నాథరెడ్డి, కడప పార్లమెంటు ఉపాధ్యక్షుడు రామగంగిరెడ్డి, శేషారెడ్డి, వెంకటస్వామి, ఆర్‌వి రమేష్, నిమ్మకాయల షాకీర్, జబీబుల్లా, డక్కా రమేష్, మల్లికార్జున, నాగభూషణం, పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

రాబోయే రోజుల్లో టిడిపిదే అధికారం

పులివెందుల రూరల్ : ఎన్నికలు ఎప్పుడు జరిగినా టిడిపిదే అధికారమని ఆ పార్టీ సీనియర్ నాయకులు యనమల రామకృష్ణుడు పేర్కొన్నారు. పులివెందుల టిడిపి ఇన్‌ఛార్జి బీటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం పార్నపల్లి రోడ్డులో సమీపంలో ఉన్న సాయికృప లేఅవుట్‌లో టిడిపి విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను ఎగరవేసి, నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగన్ నియంతృత్వ పాలనను రాష్ట్ర ప్రజలు భరించలేకపోతున్నారని తెలిపారు. లోకేష్ యువగళం పాదయాత్రకు విశేష స్పందన వస్తోందన్నారు. కడప జిల్లా ఎన్నో కష్టాల్లో ఉందని, తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే దీనిపై కూడా ప్రత్యేకదృష్టి సారిస్తామన్నారు. బీటెక్ రవి మాట్లాడుతూ ప్రతిఒక్కరు ఓర్పు, సహనంతో ముందుకుసాగి పులివెందులలో మనం జెండా ఎగురవేస్తామన్నారు. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పులివెందుల ప్రాంతంలో రైతుల ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రంలో మైదుకూరు ఇన్‌ఛార్జి పుట్టా ససుధాకర్ యాదవ్, పార్థసారధిరెడ్డి, జమ్మలమడుగు ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి, హిమకుంట్ల ప్రభాకరరెడ్డి, మాజీ పట్టణ అధ్యక్షులు వెంకటరామిరెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు అన్నారెడ్డి ప్రసాదరెడ్డి, శివమోహన్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, జోగిరెడ్డి, జయభరత్‌రెడ్డి, భూమిరెడ్డి సాయితేజ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

దర్బార్‌కు టిడిపి కండువా వేస్తున్న యనమల రామకృష్ణుడు

డ్రెయినేజీ సమస్య పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని నెరవాడలో కొన్నేళ్లుగా పరిష్కారంకాని డ్రెయినేజీ సమస్య పరిష్కారానికి వెంటనే కృషి చేస్తామని ఎంపిపి టి.లక్ష్మయ్య తెలిపారు. వర్షపు నీరు నిలుస్తున్న ప్రాంతాన్ని బుధవారం ఎంపిపి, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ రాధాకృష్ణవేణి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిమెంట్ రోడ్డు ఏర్పాటు చేసే సమయంలో డ్రెయినేజి కాలువలు ఏర్పాటు చేయకపోవడంతో వర్షపు నీరు నిలుస్తోందన్నారు. సిమెంటు కాలువకు ఇరువైపులా వర్షపు నీరు ప్రవహించేందుకు కాలువలు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. గ్రామస్తులు కూడా కాలువల ఏర్పాటుకు సహకరించాలని ఎంపిపి కోరారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు రామసుబ్బారెడ్డి, అంజన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిలిచిన నీటిని పరిశీలిస్తున్న ఎంపిపి, అధికారులు

వ్యవసాయ పరికరాలు పంపిణీ

రైతుకు పరికరాలు అందజేస్తున్న మాజీ ఎంపిపి

ప్రజాశక్తి - ముద్దనూరు

ముద్దనూరు మేజర్ గ్రామ పంచాయతీలోని చెన్నారెడ్డిపల్లెలో బుధవారం మాజీ ఎంపిపి మునిరాజారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి కృషి సంచయీ యోజన ద్వారా రైతులకు వ్యవసాయ పరికరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఆఫీసరు కల్యాణి, వ్యవసాయ అధికారి వెంకటకృష్ణారెడ్డి, సచివాలయ కన్వీనర్ చింతాటి సుమంత్ యాదవ్, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా రాణించాలి

ప్రజాశక్తి - ఖాజీపేట

విద్యార్థులు కష్టపడి చదువులో ఉన్నతంగా రాణించాలని, తల్లి దండ్రులకు మంచి పేరు తేవాలని ఖాజీపేట పద్మ మహిళ మండలి అధ్యక్షు రాలు చిన్న అమ్ములు కోరారు. కొత్తపేట జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు బుధవారం ఆమె విద్యా సామగ్రి ఉచితంగా పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గాయత్రిభాయి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తమ పాఠశాలలో విద్యార్థులకు విద్యా సామగ్రి అందిస్తున్న పద్మ మహిళ మండలి వారికి కృతజ్ఞతలన్నారు. ఈ సౌకర్యాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థులు మహనీయులని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పద్మ మహిళ మండలి ముఖ్య సలహాదారులు జూలియన్ రాజు, ఉపాధ్యాయులు సివి ప్రసాద్, శివారెడ్డి, ఫయాజ్, రామకృష్ణ రాజు, లతా, శేఖర్, శర్మ పాల్గొన్నారు.

వేంపల్లె : విద్యార్థులు క్రమశిక్షణ, ప్రణాళికబద్ధంగా కష్టపడి చదివి పాఠశాల, కళాశాలకు మంచి పేరు తేవాలని జిల్లా పరిషత్ ప్లస్ టు బాలిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నారాయణమ్మ కోరారు. బుధవారం ప్లస్ టు బాలికల ఉన్నత పాఠశాలలో ఇంటర్ విద్యార్థులకు ఉచిత పుస్తకాలను నారాయణమ్మ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పేద విద్యార్థులు ఉన్నతంగా చదివేందుకు సులువుగా ఉండాలనే ఉద్దేశంతో ఉన్నత పాఠశాలలోనే ఇంటర్ విద్యను ప్రవేశ పెట్టార న్నారు. చదువును మధ్యలో ఆపకుండా రాణించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు చెరుకూరు శ్రీనివాసులు, గుర్నాథ్‌రెడ్డి, సురేష్‌కుమార్‌రెడ్డి, పద్మావతి పాల్గొన్నారు.

విద్యా సామగ్రి అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

కలెక్టరేట్ ధర్నాకు తరలిరండి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఐసిడిఎస్‌ను పరిరక్షించాలని, అంగన్వాడీలకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం, పెన్షన్, పిఎఫ్, ఇఎస్ఐ, గ్రాడ్యూటీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10, 11న రాష్ట్రంలోని అన్ని కలెక్టరేట్ల ఎదుట 36 గంటల పాటు నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.లక్ష్మీదేవి, జిల్లా అధ్యక్షులు లక్ష్మీదేవి, సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు. ఆ మేరకు బుధవారం అంగన్వాడీ యూనియన్ ఆధ్వర్యంలో పోస్టర్స్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 10న 36 గంటలు నిరసన పాటిస్తూ దేశ వ్యాప్తంగా పోరాటం ఉధృతం చేయాలని అఖిల భారత కమిటీ పిలుపునిచ్చిందన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ లీడర్లు సుబ్బలక్ష్మి, రాణి, సువార్త, నాగలక్ష్మి, నిర్మల, సుజాత, లత పాల్గొన్నారు.

ఉచితంగా రాబిస్ టీకాలు

ప్రజాశక్తి - వేంపల్లె

కుక్కలకు రాబిస్ వ్యాధి సోకకుండా వేంపల్లె పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా టీకాలు వేస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. బుధవారం వేంపల్లెలోని పశు సంవర్ధక శాఖ వైద్యశాలలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి ఏడాది జూలై 6న ప్రపంచవ్యాప్తంగా జూనోసిస్ దినంగా నిర్వహిస్తారన్నారు. పశువుల నుండి మానవులకు, మానవుల నుండి పశువులకు సంక్రమించే వ్యాధులను జూనోటిక్ వ్యాధులు అంటారని తెలిపారు. కుక్కలు, పిల్లులు నుండి మనుషులకు సోకే అతి భయంకరమైన వ్యాధి రేబిస్ అన్నారు. దీని నివారణకు టీకా ఒక్కటే మార్గమన్నారు. ప్రతి ఎడాది పెంపుడు కుక్కల యజమానులు వాటికి తప్పకుండా రేబిస్ టీకాలు వేయించాలని కోరారు. వేంపల్లె పశు వైద్యశాలలో గురువారం పెంపుడు కుక్కలకు, పిల్లులకు టీకాలు ఉచితంగా వేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎడి రవీంద్రనాథ్‌రెడ్డి కోరారు.

CHANGE OF NAME

I, PERI SHANTHI (old name) W/o PERI SAI PURUSHOTHAM R/o. Flat No: 504, 5th Floor, Auditya Enclave, YMR Colony, Beside Sai Baba Temple, PRODDATUR-516360, do here by change my name to AYYALA SOMAYAJULA SHANTHI (New name). Hence forth then new I may be called as AYYALA SOMAYAJULA SHANTHI W/o PERI SAI PURUSHOTHAM for all purposes.

ఉత్సవ విగ్రహాల్లా సర్పంచులు

- ఎన్.తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె :

వైసిపి పాలనలో విధులు, నిధులు, అధికారాలు లేక సర్పం చులు ఉత్సవ విగ్ర హాల్లా ఉన్నారని పిసిసి మీడియా చైర్మన్ తుల సిరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేక రులతో మాట్లా డుతూ రాష్ట్ర ప్రభుత్వం పంచాయ తీలకు నిధులు విడుదల చేయక పోవడం అన్యాయమన్నారు.

IN THE COURT OF II Addl. JUNIOR CIVIL JUDGE, KADAPA.

O.S.No. 948/2019

State Bank of India, Y.M.Palli Branch, Kadapa. **...Plaintiff**

Vs

Dr.G.Prasanna Kumar, S/o Venugopal, D.No. 1/731, Yerramukkapalli, Kadapa City. **...Defendant**

నోటీసు

పై నెంబరులో వాది, ప్రతివాదిపై బాకీ నిమిత్తం దావా దాఖలు చేసివున్నారు. ప్రతివాది నోటీసుకు గాను 9.8.2023వ తేదీకి వాయిదా వున్నది. ప్రతివాదికి ఆక్షేపణలున్న ఎడల పై కోర్టులో ఉదయం 10.30లకు వాయిదాకు హాజరయి తెలుపుకొనవచ్చును. లేనంతట పరోక్షములో ఎక్సపార్టీగా తీర్మానించబడును.

కడప.

జి.వెంకటేశ్వరరెడ్డి
వాది తరపు అడ్వకేటు

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, ప్రొద్దుటూరు

O.S.NO. 4/2019

కాటిగారి నాగశేఖర్‌రెడ్డి, S/o కె.సుబ్బారెడ్డి, 55 సం॥లు, నివాసం కొర్రపాడు గ్రామం, రాజుపాళెం మండలం, వైఎస్ఆర్ జిల్లా. **...వాది**

వర్సెస్

ఎస్.నరసింహ, S/o ఎస్.రమణయ్య, 35సం॥, డోర్‌నెం. 3/317, వైఎమ్ఆర్ కాలనీ, ప్రొద్దుటూరు టవున్. **...ప్రతివాది**

దావా సమన్లు- ప్రతివాదికి

ఈ నెంబరు దావాను-వాది, ప్రతివాదిపైన ప్రోనోటు బాకీ అస్సలు-వడ్డి కలిపి రూ.1,83,100/- రాకోరి పై కోర్టులో దావా దాఖలు చేసి ఉన్నారు. ప్రతివాది అయిన నీవు పై కోర్టులో ఆక్షేపణలు ఉన్న 28/7/2023వ తేదీ పగలు ఉదయం 10.30లకు హాజరు కావలెను. లేనంతట నీ పరోక్షంగా తీర్మానించబడును.

వాయిదా తేదీ. 28.07.2023

//కోర్టు ఉత్తర్వు మేరకు//

పి.రామచంద్రారెడ్డి,
బి.రమాదేవి
అడ్వకేట్స్
ప్రొద్దుటూరు. సెల్: 9908548965.

మహారాజశ్రీ జమ్మలమడుగు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

ఓ.ఎస్.నెం. 70/2023

కాసా నారమ్మ, భర్త పుల్లారెడ్డి, వయసు 48 సంవత్సరాలు. హిందూ, వ్యవసాయం, టంగుటూరు గ్రామం డోర్ నెంబర్. 5/6, బోదుపల్లె గ్రామం, మైలవరం మండలం, కడప జిల్లా. **...వాది**

వర్సెస్

దాసు వీర బ్రహ్మయ్య తండ్రి చిన్న వీరయ్య, మాజీ సైనిక ఉద్యోగి , వయసు 58 సంవత్సరాలు , హిందూ , కన్నెలూరు గ్రామం, జమ్మలమడుగు పట్టణం మరియు మండలం, కడప జిల్లా. **...ప్రతివాది**

దావా సమన్లు

పై నెంబర్ దావా వాది ప్రతివాది ఐనా మీపై దావా భాకి రాబట్టు నిమిత్తము పై కోర్టులో దావా దాఖలు చేసినారు. అట్టి దావా లో మీకు ఏమైనా ఆక్షేపణ లు ఉన్న యెడల పై కోర్టులో 27-07-2023వ తేదీన ఉదయం 10.30 ని..లకు హాజరై తెలుపుకోవలెను. లేనంతట మీ పరోక్షమున ఎక్స్ పార్టీగా తీర్మానించబడును.

వాయిదా తేదీ. 27.07.2023

//By order of the Junior Civil Judge Court, Jammalamadugu//

VUNDELA MUNISUBBAREDDY,
B.A, L.L.B,
Advocate, JAMMALAMADUGU.

మహారాజశ్రీ జమ్మలమడుగు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

ఓ.ఎస్.నెం. 386/2022

సంగి గురుదేవి, భర్త నాగార్జున రెడ్డి వయసు 38 సంవత్సరాలు. హిందూ, వ్యవసాయం, డోర్ నెంబర్.19/941, వెంకటేశ్వరకాలనీ, జమ్మలమడుగుటౌన్ మరియు మండలం, కడప జిల్లా. **...వాది**

వర్సెస్

దాసు వీర బ్రహ్మయ్య తండ్రి చిన్న వీరయ్య, మాజీ సైనిక ఉద్యోగి , వయసు 58 సంవత్సరాలు , హిందూ , కన్నెలూరు గ్రామం, జమ్మలమడుగు పట్టణం మరియు మండలం, కడప జిల్లా. **...ప్రతివాది**

దావా సమన్లు

పై నెంబర్ దావా వాది ప్రతివాది ఐనా మీపై దావా భాకి రాబట్టు నిమిత్తము పై కోర్టులో దావా దాఖలు చేసినారు. అట్టి దావాలో మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల పై కోర్టులో 27-07-2023వ తేదీన ఉదయం 10.30 ని॥లకు హాజరై తెలుపుకోవలెను. లేనంతట మీ పరోక్షమున ఎక్స్ పార్టీగా తీర్మానించబడును.

వాయిదా తేదీ. 27.07.2023

//By order of the Junior Civil Judge Court, Jammalamadugu//

VUNDELA MUNISUBBAREDDY,
B.A, L.L.B,
Advocate, JAMMALAMADUGU.